సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023





ఇల్లంతకుంటలో వేషధారణలో చిన్నారులు

న్యూస్‌రీల్

మిడ్‌మానేరుకు వరద



ఆరుగేట్ల ద్వారా ఎల్‌ఎండీకి నీటి విడుదల

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరుకు వరద ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు ప్రాజెక్ట్‌లోకి 10వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ ఆరు గేట్ల ద్వారా ఎల్‌ఎండీకి 10 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్ట్‌లో 20.04 టీఎంసీల మేర నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి



సమావేశమైన అఖిలపక్షం నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో బుధవారం సమావేశమై రెవెన్యూ డివిజన్ సాధన కమిటీని ఎన్నుకున్నారు. అఖిల పక్షం నాయకులు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ సాధించే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. సాధన కమిటీ కన్వీనర్‌గా ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్, కో–కన్వీనర్లుగా పొన్నాల తిరుపతిరెడ్డి, నద్ది లక్ష్మారెడ్డి, మాలోతు సూర్యనాయక్, నీరటి భాను, కార్యదర్శులుగా దూస శ్రీనివాస్, గుండాడి వెంకట్‌రెడ్డి, చెట్కూరి నారాయణ, ప్రచార కమిటీ సభ్యులుగా దొమ్మాటి నర్సయ్య, పంజా సంపత్‌కుమార్, ఎడ్ల రాజ్‌కుమార్, వరదవెల్లి స్వామిగౌడ్, కంచర్ల పర్శరాములు, కోశాధికారులుగా బందారపు లక్ష్మారెడ్డి, గుండాడి రాంరెడ్డి, గౌస్, సోషల్‌మీడియా కన్వీనర్లుగా మాలోతు సాయి, కిరణ్‌కుమార్, జంగం మధు, ఒగ్గు మహేశ్, సుడిది రాజేందర్, లింగాల సన్నిని ఎన్నుకున్నారు.

పిల్లల్లో పోషక లోపాలు నివారించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల: పిల్లల్లో పోషక లోపాలను నివారించేందుకు చిరు ధాన్యాలను అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. జెడ్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాను పోషక లోప రహిత జిల్లాగా మార్చాలని కోరారు. ప్రతీ రెండో శనివారం మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో పోషకాహార లోపాలను గుర్తించి అదనపు ఆహారం ఇవ్వాలని సూచించారు. రాగిజావ, రాగి లడ్డు, రాగి పాయసం ఇవ్వడం ద్వారా ఇనుము, కాల్షియం, ప్రొటీన్ లోపాలను నివారించవచ్చన్నారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సీడీపీవో ఎల్లయ్య, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో–ఆర్డినేటర్ రోజా, ఏసీడీపీవో సుచరిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్మల పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్స్‌కు ఎంపిక

సిరిసిల్లఅర్బన్: స్పోర్ట్స్ పాఠశాలల్లో ప్రవేశాలకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికై నట్లు డీవైఎస్‌వో అజ్మీర రాందాస్ బుధవారం తెలిపారు. రాష్ట్ర క్రీడాపాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో బి.హర్షిత(4వ తరగతి), బి.సహస్ర, బి.వినమ్రత్‌సిన్హా 5వ తరగతి ఆదిలాబాద్ స్పోర్ట్స్ పాఠశాలకు, ఇ.శ్రీనిజ 4వ తరగతి హైదరాబాద్, టి.అక్షిత 5వ తరగతి కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్స్‌కు ఎంపికైనట్లు వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో అధికారులు

వేములవాడఅర్బన్: మున్సిపల్ పరిధి నాంపల్లిలోని శాంతినగర్ నిర్మల హైస్కూల్‌లో బుధవారం జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. నెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ మారంపల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ పోటీల్లోని విజేతలను రాష్ట్రస్థాయి టోర్నీకి ఎంపికవుతారని తెలిపారు. జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు శిరీష, జలంధర్, రాజశేఖర్, జనార్దన్, నరేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

నిండిన గోదాములు.. నిలిచిన వస్త్ర సేకరణ

- బతుకమ్మ చీరల లక్ష్యంపై నీలినీడలు
- ప్రాసెసింగ్ యూనిట్లు కేటాయించక ఇబ్బంది
- ఇప్పటి వరకు 3.60 కోట్ల మీటర్ల బట్ట సేకరణ
- ఇంకా సేకరించాల్సింది 1.96 కోట్ల మీటర్లు
- ఈనెల 15లోగా ముగియనున్న గడువు



సాంచాలపై బతుకమ్మ చీరల ఉత్పత్తి

సిరిసిల్ల: రాష్ట్ర వ్యాప్తంగా 1.20 కోట్ల మంది మహిళలకు బతుకమ్మ చీరలను కానుకగా అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం బట్ట ఉత్పత్తి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు అందించింది. ఆరు నెలలుగా వస్త్రోత్పత్తిదారులు బతుకమ్మచీరల బట్టను ఉత్పత్తి చేస్తున్నారు. బట్ట గట్టాలను సేకరించి స్థానిక ఇందిరానగర్‌లోని గోదాములో భద్రపరుస్తున్నారు. గోదాములు నిండిపోవడంతో బతుకమ్మ చీరల బట్ట సేకరణ నిలిచిపోయింది. చీరల బట్టను వస్త్రోత్పత్తిదారులు సెప్టెంబర్ 15లోగా ఇవ్వాలనే గడువు విధించారు. బట్ట సేకరణ నిలిచిపోవడంతో లక్ష్యం పూర్తి చేయడంపై వస్త్రోత్పత్తిదారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రాసెసింగ్ యూనిట్లు కేటాయించకనే..

సేకరించిన బట్టను ఎప్పటికప్పుడు ప్రాసెసింగ్ యూనిట్లకు తరలించాలి. కానీ ఈ ఏడాది మూడు ప్రాసెసింగ్ యూనిట్లను మాత్రమే కేటాయించడంతో పూర్తి స్థాయిలో చీరల గట్టాలు వెళ్లడం లేదు. మరో మూడు ప్రాసెసింగ్ యూనిట్లకు బట్టను కేటాయించాల్సి ఉండగా.. టెస్కో అధికారులు జాప్యం చేస్తున్నారు. ఫలితంగా గోదాము ఖాళీ కావడం లేదు. ప్రాసెసింగ్ చేయడం ద్వారా బట్ట నునుపు(స్మూత్)గా తయారవుతుంది. చీరల బట్ట ఉత్పత్తి పూర్తయి వస్త్రోత్పత్తిదారుల వద్ద సిద్ధంగా ఉన్నా.. గోదాములు ఖాళీ లేక సేకరించడం లేదు.

2022 నాటి చీరల బట్ట సేకరణ



సిరిసిల్ల గోదాముకు ఆటోల్లో వచ్చిన బతుకమ్మ చీరల గట్టాలు

జౌళిశాఖ అధికారులు గతడాది ఉత్పత్తి చేసిన చీరల బట్టను సేకరిస్తున్నారు. వాస్తవానికి జౌళిశాఖ అధికారులు ఈ ఏడాది బతుకమ్మ చీరల ఆర్డర్లను తొలుత వరంగల్‌లోని కొందరు వస్త్రోత్పత్తిదారులకు ఇచ్చారు. ఉత్పత్తి చేస్తామంటూ ఆరు నెలలపాటు కాల వెళ్ల దీసిన వారు చివరికి చేతులు ఎత్తివేయడంతో ఆగమేఘాల మీద సిరిసిల్లలోని పాతబట్టను సేకరిస్తున్నారు. కొత్తబట్టకు గోదాముల్లో స్థలం లేకపోగా.. పాతబట్టను మాత్రం సేకరిస్తూ ప్రాసెసింగ్‌కు నేరుగా పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా టెస్కో అధి కారుల నిర్వాకంతో బతుకమ్మచీరల బట్ట సేకరణ గందరగోళంగా మారింది. ఇప్పటికైనా ప్రాసెసింగ్ యూనిట్లను కేటాయిస్తే బతుకమ్మ చీరల బట్ట సేకరణ సజావుగా సాగనుంది.

బతకమ్మ చీరల ఉత్పత్తి స్వరూపం

చీరల ఆర్డర్లు	: 5.56 కోట్ల మీటర్లు
ఆర్డర్ల విలువ	:రూ.330 కోట్లు
ఉత్పత్తి చేస్తున్న చిన్నతరహా పరిశ్రమలు	:127
ఉత్పత్తిలో భాగస్వాములైన మ్యాక్స్ సంఘాలు	:139
ఒక్కో మీటరుకు ప్రభుత్వం చెల్లించేది	:రూ.35.50
ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్న సాంచాలు	:12,500
శ్రమించే నేతకార్మికులు	:5 వేల మంది
నిత్యం ఉత్పత్తి అవుతున్న చీరల బట్ట	:6 లక్షల మీటర్లు
ఇప్పటికే సేకరించిన బతుకమ్మ చీరల బట్ట	:3.60 కోట్ల మీటర్లు
ఇంకా సేకరించాల్సిన బట్ట	:1.96 కోట్ల మీటర్లు
చీరలు అందించాల్సిన చివరి గడువు	:15సెప్టెంబరు 2023

వర్షాల కారణంగా ఆలస్యం



ముసురు వర్షాలతో బతుకమ్మ చీరల బట్ట సేకరణ ఆలస్యమైంది. బట్టను ఆరుబయట నిల్వ చేసేందుకు అవకాశం లేదు. గోదాములు ఖాళీ చేయించి సేకరించేలా చూస్తాం. ప్రాసెసింగ్ యూనిట్ల కేటాయింపులను పూర్తిచేస్తాం. బతుకమ్మ చీరల బట్ట సేకరణ గడువులోగా పూర్తి చేసి పండుగలోగా రాష్ట్రమంతా బతుకమ్మ చీరలు పంపిణీ జరిగేలా చూస్తాం. – గూడూరి ప్రవీణ్, టీపీటీడీసీ చైర్మన్



హరినామ జపయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ముకుందా.. ముకుందా..

సిరిసిల్లకల్చరల్: శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకలు సిరిసిల్లలో బుధవారం వైభవంగా నిర్వహించారు. అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో తొలిసారి జిల్లా కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో ఇస్కాన్ జిల్లా శాఖ సారథ్యంలో ప్రతినిధులు ప్రాణనాథ అచ్చుతదాస్, భావమయ నిత్యానందదాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అభిషేకం, దర్శనహారతి, హరినామ జపయజ్ఞం, సాయంత్రం ధూపహారతి, భోగనైవేద్యం, మహా మంగళహారతి నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ప్రభుత్వ అవసరాలకు పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టి, వేగంగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయతి కోరారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో బుధవారం సమీక్షించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. కోనరావుపేట, ముస్తాబాద్, బోయినపల్లి, గంభీరావుపేట మండలాల్లో ఎక్కువగా పెండింగ్ ఉన్నాయని ప్రస్తావించారు. క్షేత్రస్థాయి నివేదికలు ఇవ్వడంలో తహసీల్దార్లు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఉండి ఆ దరఖాస్తులను పరిష్కరించాలని స్పష్టం చేశారు. మండలాల్లో పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని, ప్రగతిలో ఉన్న పనులు పూర్తి చేయించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలని కోరారు. మీసేవలో పెండింగ్‌లో దరఖాస్తులను తహసీల్దార్లు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కస్టమ్ మిల్లింగ్ బియ్యం (సీఎంఆర్) ఎఫ్‌సీఐకి అందించేలా రైస్‌మిల్లులను సందర్శించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, టీపీవో అన్సార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వైభవంగా డోలోత్సవం



వేములవాడ: రాజన్న ఆలయంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని మహామండపంలో బుధవారం రాత్రి డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం చిన్నారి కృష్ణులతో ఉట్లు కొట్టించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మ్యుటేషన్ పంచాయితీ!

- గ్రామాల్లో వారసులకు దక్కని పూర్వీకుల ఇళ్లు
- మ్యుటేషన్, ఎడిట్ ఆప్షన్ తీసేసిన ప్రభుత్వం
- ఏప్రిల్ నుంచి వేలాది దరఖాస్తులు పెండింగ్
- రూ.లక్షలు పోసి ఇళ్లు కొన్నా.. పేరు మారని వైనం
- చనిపోయిన వారి పేర్లమీదే రూ.కోట్లాది ఆస్తులు

> ‘పెద్దపల్లి జిల్లాలోని ఓ కుగ్రామంలో ఉన్న ఇల్లు వారసత్వంగా వచ్చింది. నాలుగు తరాలుగా అదే ఇంట్లో వారసులు కూడా నివసిస్తున్నారు. అయితే ఆ ఇంటిని వారసుల పేరిట మార్చుకోవాలనుకున్నారు. కానీ.. ఇంటి యజమాని మరణించిన కారణంగా విరాసత్ కావడం లేదు.’

> ‘సిరిసిల్ల మండలంలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. ఇటీవల ఆయన స్వగ్రామంలోని పొరుగింటిని కొనుగోలుచేశాడు. మ్యుటేషన్ చేయించుకోవాలని యత్నించినా.. సాధ్యంకాలేదు.’



జిల్లా	గ్రామ పంచాయతీలు
కరీంనగర్	313
పెద్దపల్లి	267
రాజన్నసిరిసిల్ల	255
జగిత్యాల	380

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఇది పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలోని పరిస్థితే కాదు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొన్న దుస్థితి. ఆస్తులు తమవే అయినా.. పేర్లు మారకపోవడం.. యజమానులు మరణించ డం.. వెరిసి ఏంచేయాలో తెలియక వారసులు సతమతమవుతున్నారు. మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.

అసలేం జరిగింది?

ఒకప్పుడు గ్రామాల్లో ఆస్తుల బదిలీ రెండు రకాలుగా జరిగేది. మొదటిది వారసుల పేరు మీదికి.. రెండోది ఇంటిని కొన్న వారి పేర మ్యుటేట్ అయ్యేవి. ఇందుకు సంబంధించిన ‘ఇ–పంచాయత్’ వెబ్‌సైట్‌లో మీ సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకునేవారు. ఇందుకోసం రెండు ఆప్షన్లు అందుబాటులో ఉండేవి. అందులో మొదటిది విరాసత్, రెండోది కోర్టు డిక్రీ. ఇందులో ఇంటి యజమానులు తమ ఆస్తులను విరాసత్ దరఖాస్తు ద్వారా వారసులకు ఇచ్చేవారు. రెండు కొనుగోలు చేసుకున్న వా రు కోర్టు డిక్రీ ద్వారా దరఖాస్తు చేసుకునేవారు. ఈ దరఖాస్తులను గ్రామ పంచాయతీ సెక్రటరీ విచారణ జరిపిన తర్వాత ఆస్తి మ్యుటేట్ అయ్యేది. గతంలో ఎడిట్ ఆప్షన్ ఉండేది. దీంతో ఏమైనా తప్పులు ఉన్నా దాన్ని అక్కడే పరిష్కరించుకునేవారు. ఇది చాలా వేగవంతమైన ప్రక్రియ తక్కువ ఖర్చుతో త్వరగా పూర్తయ్యేది. ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుంచి టీఎస్, బీపాస్ అమల్లోకి తీసుకొచ్చింది. దీని ప్రకారం.. గ్రాపపంచాయతీ ఆస్తుల రిజిస్ట్రేషన్లు అన్నీ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే జరుగుతున్నాయి. దీంతో ‘ఇ–పంచాయత్’ వెబ్‌సైట్లో విరాసత్, కోర్టు డిక్రీ ఆప్షన్లు మాయమయ్యాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది ఇళ్ల బదిలీ కాక అలాగే మిగిలిపోతున్నాయి.

సమస్య ఏంటి?

నాలుగు జిల్లాల్లోని గ్రామాల్లో వేలాది ఇండ్లకు సరైన ధ్రువపత్రాలు లేవు. దశాబ్దాల తరబడి వారసత్వంగా ఇండ్లు చేతులు మారుతున్నాయి. వాటికి ఇంటి నెంబర్లు ఉంటాయి. ఏటా ఇంటి పన్నులు కడుతారు. కానీ.. ఆ ఇల్లు కొన్నట్లు, కట్టినట్లు ఎలాంటి పత్రాలు లేవు. వాస్తవానికి గ్రామపంచాయతీల ఆవిర్భవానికి ముందు నుంచే ఆ ఇళ్లు మనుగడలో ఉన్నాయి. ఇలాంటి ఇళ్ల పరిస్థితుల్లో ప్రధానమైన చిక్కులు తలెత్తుతున్నాయి.

అడ్డంకులివే..

- ఇంటి యజమానులు లేకుంటే ఆ ఇళ్లు వారసుల పేరిట బదిలీ కావడం లేదు. యజమాని బతికుంటే విరాసత్ సజావుగా సాగుతున్నాయి.
- ఇంటి నెంబరు, ఇంటి పన్నులు కట్టిన కాగితాలు తప్ప ఇంటికి సంబంధించిన ఇతర డాక్యుమెంట్లు ఏవీ లేని ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు నిరాకరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.
- ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్లు.. అంతకుముందు సరైన డాక్యుమెంట్లు లేని ఇండ్లను చాలామందే కొనుగోలు చేశారు. వీటిలో చాలామటుకు మ్యుటేషన్ కాలేదు. టీఎస్ బీపాస్‌తో ఆస్తులు మ్యుటేషన్ కాకపోవడంతో ఆఫీసర్లు పక్కన పెడుతున్నారు.
- గతంలో రేకుల ఇల్లు/ పెంకుటిల్లును కూల్చి, గ్రామంలో కొత్తగా జీ+2 నిర్మించుకున్నా సరే ఆన్‌లైన్‌లో ఇంకా పాత రేకుల ఇల్లు/ పెంకుటిల్లుగానే చూపెడుతోంది. ‘ఎడిట్’ ఆప్షన్ లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో అన్ని అనుమతులతో ఇల్లు నిర్మించుకున్న యజమానులు, పన్నులు రాక పంచాయతీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఇబ్బందులివీ..

- కుటుంబ అవసరాలకు ఇంటిని విక్రయించాలనుకుంటున్న వారికి పేరుమార్పిడి నిబంధన ఇబ్బందికరంగా మారింది.
- పెళ్లిళ్లు, అనారోగ్య కారణాలతో సతమతమవుతున్న వారు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.
- ఆస్తులు అమ్మాలనుకుంటున్న వారు పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, వార్డు మెంబర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- వృద్ధులు, నిరక్షరాస్యులు ఏంతెలియక సతమతమవుతున్నారు. ఇంకొన్నిచోట్ల ఇదే అదనుగా కొందరు ఇదిచేస్తాం.. అదిచేస్తామంటూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.
- గతంలో ఇంటిని కొన్నాక.. ఇప్పుడు మ్యుటేషన్ కాకపోవడంతో కొనుగోలుదారుడు, విక్రయదా రుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పేరు మారని ఆస్తులు మాకేందుకంటూ నిలదీస్తున్నారు.

అవకాశం కల్పించాలి..



రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. రిజిస్ట్రేషన్ ద్వారా మ్యుటేషన్ ఆన్‌లైన్ చేయడం మంచిదే. వంశపారంపర్యంగా వస్తున్న ఆస్తుల పేరు మార్పిడి కొరకు గ్రామ పంచాయతీలో కూడా అవకాశాన్ని కల్పించాలి. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించలేని పేదలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– మాట్ల మధు, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, సిరిసిల్ల

కమిటీ నివేదిక రావాలి

ఏప్రిల్ ఒకటి తర్వాత టీఎస్ బీపాస్ అమల్లోకి వచ్చింది. ఆస్తుల పేర్లమార్పిడిపై ఎదురవుతున్న ఇబ్బందులపై అభ్యంతరాలు, వినతులు వెల్లువెత్తాయి. విషయాన్ని హైదరాబాద్‌లోని ఉన్నతాధికాల దృష్టికి తీసుకెళ్లాం. ఆస్తుల మ్యుటేషన్ సమస్యలు అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీ వేసింది. కమిటీ నివేదిక త్వరలో ప్రభుత్వానికి అందజేయనుంది. సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందని ఆశిస్తున్నాం.

– వీరబుచ్చయ్య, డీపీవో, కరీంనగర్

గిరిజన తండాల రోడ్లకు రూ.13.60 కోట్లు

సిరిసిల్ల: జిల్లాలోని గిరిజన తండాలకు తారు రోడ్ల నిర్మాణాలకు రూ.13.60కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి కేటీఆర్ సిరిసిల్ల క్యాంపు ఆఫీస్ ఇన్‌చార్జి గణరాజ్ బుధవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన తండాలకు తారు రోడ్ల నిర్మాణాలకు రూ.444.21 కోట్లు మంజూరైనట్లు వివరించారు. వీర్నపల్లి మండలంలోని కీలోత్‌తండా నుంచి శంకర్‌నాయక్ తండా రోడ్డుకు రూ.4.20కోట్లు, కంచర్ల నుంచి ఎగ్లాస్‌పూర్ రోడ్డుకు రూ.63 లక్షలు, వీర్నపల్లి బడి చెరువుతండా నుంచి కేజీబీవీ స్కూల్ వరకు రూ.2.15కోట్లు, బంజేరు నుంచి మద్దిమల్లతండా రోడ్డుకు రూ.1.86 కోట్లు, ఎల్లారెడ్డిపేట మండలంలోని జెడ్పీ రోడ్డు నుంచి గుంటుపల్లిచెరువుతండాకు రూ.68లక్షలు, గంభీరావుపేట–లక్ష్మీపూర్ రోడ్డుకు రూ.3.08 కోట్లు, ముస్తాబాద్ మండలంలోని సబ్‌స్టేషన్ నుంచి సేవాలాల్‌తండా రోడ్డుకు రూ.కోటి మంజూరు చేశారని వివరించారు.

రైతుల సేవలో కేడీసీసీబీ



పనులు పరిశీలిస్తున్న నాయకులు

చందుర్తి(వేములవాడ): రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించేందుకు కేడీసీసీ బ్యాంక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు డైరెక్టర్ ఉచ్చిడి మోహన్‌రెడ్డి, హెడాఫీస్ మేనేజర్ హన్మంతరావు పేర్కొన్నారు. చందుర్తిలో ఏర్పాటు చేస్తున్న బ్యాంకు కార్యాలయాన్ని బుధవారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రుద్రంగి మేనేజర్ రమేశ్, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, సింగిల్‌విండో సీఈవో ఏరెడ్డి గంగారెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, కమలాకర్ ఉన్నారు.

క్లుప్తంగా

దుబాయ్‌లో కేటీఆర్‌కు ఘన స్వాగతం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మున్సిపల్, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ దుబాయ్ పర్యటనకు వెళ్లగా ఎన్‌ఆర్‌ఐ రాధారపు సత్యం ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం పలు కార్యక్రమాలలో మంత్రి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం



వేములవాడఅర్బన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలకు సమ న్యాయం జరిగిందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని కొదురుపాకలోని 10 మందికి బీసీబంధు చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, ఎంపీపీ వేణుగోపాల్, వైస్‌ఎంపీపీ నాగయ్య, కొనుకటి లచ్చిరెడ్డి, కత్తెరపాక కొండయ్య తదితరులు ఉన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని పార్కుల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూశం రమేశ్ కోరారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని పార్కులు, డివైడర్‌లలో పనిచేసే కార్మికులు నెలకు రూ.6వేల వేతనంతో కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్త చేశారు. కాంట్రాక్టర్లు సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మల్కపేట రిజర్వాయర్‌కు కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టండి



సిరిసిల్లఅర్బన్: మల్కపేట రిజర్వాయర్‌కు మాజీ ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టాలని బీఎస్పీ నాయకులు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ విముక్తి కోసం కర్రోల్ల నర్సయ్య రజాకార్లతో పోరాడారన్నారు. ఈప్రాంత ఎమెల్యేగా బడుగు బలహీన వర్గాల కోసం నిరంతం పాటుపడ్డారన్నారు. ఎనగందుల ఎంకన్న, వరదవెల్లి స్వామి, అంకని భాను, మేకల మునీందర్, బొడ్డు మహేందర్, యారప్ప, రాజబాబు, నబీ, సాగర్, యాదగిరి, రమేశ్, మల్లేశం పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తుర్కపల్లిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.4,770 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వానలోనూ నిరసనల హోరు

- ఎన్‌హెచ్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని మోకాళ్లపై నిరసన
- సమగ్ర శిక్షా అభియాన్‌ల వంటావార్పు
- కొనసాగుతున్న మాజీ సర్పంచ్‌ల రిలే నిరహార దీక్ష

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం బుధవారం నిరసనలు, నినాదాలతో హోరెత్తింది. ఎన్‌హెచ్‌ఎంలోని ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల వంటావార్పు, మాజీ సర్పంచ్‌ల రిలే నిరహార దీక్షలు కొనసాగాయి.

పర్మినెంట్ చేయండి



వంటావార్పుతో నిరసన

ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు మోకాళ్లపై నిరసన వ్యక్తం చేసి, వంటావార్పుతో నిరసన చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పపూల దేవేందర్, రాజేందర్, అబ్దుల్ ఖయ్యూం తదితరులు ఉన్నారు.

మోకాళ్లపై నిరసన



నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపడుతున్న సమ్మె ఏడో రోజుకు చేరింది. స్థానిక అంబేడ్కర్‌చౌరస్తా వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు మోకాళ్లపై నిరసన తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించి, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, ఉద్యోగులు పర్వీన్, వనిత, లావణ్య, కవిత, రాధ, స్రవంతి, బాలకృష్ణ ఉన్నారు

29వ రోజు మాజీ సర్పంచ్‌ల నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేపడుతున్న మాజీ సర్పంచ్‌లు

సమస్యలు పరిష్కరించాలని స్థానిక అంబేడ్కర్‌చౌక్‌లో మాజీ సర్పంచ్‌లు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 29వ రోజుకు చేరింది. ప్రభుత్వం ఇప్పటికైన తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. మాజీ సర్పంచులు బొడ్డు దేవయ్య, బుర్ర మల్లేశంగౌడ్, కాంతయ్య ఉన్నారు.

తుంపరవాన.. పారిన ఒర్రెలు

- ఇల్లంతకుంటలో అత్యధికంగా 23.1 మిల్లీమీటర్లు

సిరిసిల్ల: జిల్లాలో నాలుగు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. బుధవారం ఉదయం తుంపరతో మొదలైన వాన సాయంత్రం వరకు తగ్గింది. మిడ్‌మానేరు, ఎగువమానేరు, మూలవాగు జలాశయాలు నిండుకుండల్లా మారాయి. జిల్లాలోని 95 శాతం నీటి వనరులు మత్తడి దూకుతున్నాయి. వచ్చే యాసంగి సీజన్‌కు సాగునీటి ఇబ్బందులు తీరే పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రంలోని మొదటి బైపాస్ రోడ్డులో ఇటీవల నాటిన హరితహారం మొక్కలు నేలకూలాయి. సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారిలో కొదురుపాక వద్ద ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణంలో ఉండడంతో వర్షాలతో బురదమయంగా మారింది.

వర్షాలతో 'కరెంట్' కష్టాలు

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడం, ఎక్కడ పడితే అక్కడ బ్రేక్‌డౌన్ అవుతుంది. శాంతినగర్ శివారులో విద్యుత్‌స్తంభం కూలడంతో సిరిసిల్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 'సెస్' సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నిరుటి కంటే మెరుగైన వానలు

జిల్లాలో గతేడాది కంటే ఈ సంవత్సరం మెరుగైన వర్షాలు పడ్డాయి. బుధవారం నాటికి సగటు వర్షపాతం 592.9 మిల్లీమీటర్లు కాగా.. ఇప్పటికే 938.6 మిల్లీమీటర్లు కురువగా.. గతేడాది 893.3 మిల్లీమీటర్లు పడింది. జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 58 శాతం అదనంగా పడింది. వేములవాడరూరల్ మండలంలోనే సాధారణ వర్షం పడగా.. మిగతా అన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైంది.



శాంతినగర్‌లో కూలిన విద్యుత్ స్తంభం

వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

రుద్రంగి	: 2.7	కోనరావుపేట	: 9.1
చందుర్తి	: 2.6	వీర్నపల్లి	: 1.3
వేములవాడ రూరల్	: 1.7	ఎల్లారెడ్డిపేట	: 4.6
		గంభీరావుపేట	: 4.2
బోయినపల్లి	: 3.8	ముస్తాబాద్	: 7.4
వేములవాడ	: 6.7	తంగళ్లపల్లి	: 15.1
సిరిసిల్ల	: 12.7	ఇల్లంతకుంట	: 23.1

కూలిన ఇల్లు

కోనరావుపేట(వేములవాడ): మండలం కనగర్తిలో తెడ్డు బాబుకు చెందిన ఇల్లు కూలింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

'బలగం' సర్పంచ్‌కు కన్నీటి వీడ్కోలు

- పలువురి సంతాపం
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు



కీసరి నర్సింగం (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): బలగం సినిమాలో సర్పంచ్‌గా నటించిన కీసరి నర్సింగం అంత్యక్రియలు బుధవారం అభిమానుల కన్నీటి మధ్య పూర్తయ్యాయి. కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన కీసరి నర్సింగం కొన్నేళ్లుగా నాటక ప్రదర్శనలు చేస్తూ గుర్తింపు పొందారు. ఇటీవల వేణు డైరెక్షన్‌లో వచ్చిన బలగం సినిమాలో సర్పంచ్‌గా నటించి అందరి ప్రశంసలు పొందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న నర్సింగం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందారు. నర్సింగంకు భార్య భూమవ్వ, కుమారుడు శ్రీనివాస్, కూతురు అంజలి ఉన్నారు. అంత్యక్రియల్లో జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, డీపీఆర్వో మామిండ్ల దశరథం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, సర్పంచ్ లావణ్య–శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ శ్రీకుమార్, నాయకులు రాఘవరెడ్డి, పిట్టల భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సింగం మృతదేహంపై కండువా కప్పుతున్న చొక్కాల రాము

ఓటు ఆయుధాన్ని వినియోగించాలి

- సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్

సిరిసిల్ల: ప్రతి ఒక్కరూ ఓటు ఆయుధాన్ని వినియోగించాలని సిరిసిల్ల ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్ కోరారు. సిరిసిల్లలోని పీజీ కాలేజీలో బుధవారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. 2023 అక్టోబరు 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఫామ్–6 ద్వారా ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, ఆన్‌లైన్‌లోనూ నమోదు కావచ్చని వివరించారు. ఎన్నికల రోజు ఓటు హక్కు లేకుంటే.. ఐదేళ్లు ఓటు వేసే అవకాశాన్ని కోల్పోతారన్నారు. ఈవీఎంల పని తీరుపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ బూత్‌లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని వారి వద్ద ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నోడల్ అధికారి కూర నర్సింహులు, ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ షఫీ, కళాశాల కరస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

వలసొచ్చిన వారిని గెలిపిద్దామా?

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): కరీంనగర్‌లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకుని 20 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలను పట్టించుకోకుండా, ఎన్నికల సమయంలో వలస వచ్చే వారిని గెలిపిద్దామా? అని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. మండలకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని హెల్త్‌క్యాంపుల పేరిట గ్రామాలకొచ్చే వారి మాటలు నమ్మి, మోసపోవద్దని కోరారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు ఇస్తామన్న సీఎం కేసీఆర్ మరిచిపోయారన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు నియోజకవర్గ ప్రజలకు చేసిందేమి లేదని ఎద్దేవా చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. 2005లో వైఎస్సార్ మండలంలోని మల్యాలకు వచ్చి రూ.1700 కోట్లతో ఎల్లంపల్లి పథకాన్ని భూమిపూజ చేస్తే.. ఈ ప్రభుత్వం కనీసం కాల్వల పనులు కూడా చేయలేదన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న ఆది శ్రీనివాస్

కాంగ్రెస్‌లో చేరిన యువకులు

మండలంలోని రామన్నపేట, ఆశిరెడ్డిపల్లి, మల్యాల గ్రామాలకు చెందిన 100 మందికి పైగా యువకులు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు నచ్చకనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జెడ్పీటీసీ నాగం కుమార్, సర్పంచ్ నేతికుంట జలపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టె ప్రభాకర్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బొజ్జ మల్లేశం, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు బానాల రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంతుపూరి బాలకృష్ణారెడ్డి, నాయకులు అంచా శ్రీహరిరెడ్డి, వేల్పుల దేవస్వామి, పులి సత్యం, దారం చంద్రం, దూది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు నీళ్లపాలు!

- మూలవాగులో రూ.62 కోట్లతో 13 చెక్‌డ్యామ్‌లు
- బొల్లారం చెక్‌డ్యామ్‌ను తొలగిస్తున్న అధికారులు
- ముందుచూపు లేని నిర్ణయాలతో ప్రజాధనం వృథా

వేములవాడరూరల్: అధికారుల ముందుచూపు లేమితో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా.. ప్రజాధనం వృథా అవుతుంది. వేములవాడ నియోజకవర్గ పరిధిలో భూగర్భ జలాలు పెంచేందుకు మూలవాగుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. కోనరావుపేట మండలం మరిమడ్ల నుంచి వేములవాడ పట్టణం వరకు ఉన్న మూలవాగుపై 13 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి మంజూరు వచ్చింది. వీటికి దాదాపు రూ.62 కోట్లు కేటాయించారు. అధికారులు ముందు చూపు లేకుండా నిర్మించిన ఈ చెక్‌డ్యామ్‌లతో ఆయా గ్రామాల్లోని రైతులకు శాపంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని బొల్లారం వద్ద రూ.5.67కోట్లతో 180 మీటర్ల వెడల్పుతో 4.86 మిలియన్ క్యూబిక్ అడుగుల నీరు నిల్వ సామర్థ్యంతో చెక్‌డ్యామ్ నిర్మించారు. పై నుంచి వచ్చిన వరద నీటితో ఈ చెక్‌డ్యాంకు గైడ్‌వాల్ నిర్మించకపోవడంతో గ్రామాల్లోని రైతుల పంటపొలాలకు, బొల్లారం గ్రామంలోని వరద చేరింది. దీంతో చెక్‌డ్యామ్‌ను తొలగించేందుకు మూడు రోజులుగా ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు శ్రమిస్తున్నారు. చెక్‌డ్యాంను బ్లాస్టింగ్ చేస్తూ తొలగిస్తున్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యాంను అధికారుల ముందుచూపు లేమితో ఇలా అర్ధంతరంగా తొలగించాల్సి వస్తుంది.



కొనసాగుతున్న చెక్‌డ్యాం తొలగింపు పనులు

ఆర్థిక ఇబ్బందులతో గీతకార్మికుడి ఆత్మహత్య



రమేశ్ (ఫైల్)

సిరిసిల్లఅర్బన్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ గీత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరుకు చెందిన బెజ్జారపు రమేశ్‌గౌడ్(40) గీతవృత్తిపై ఆధారపడి బతుకుతున్నాడు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. తీవ్ర మనోవేదనకు గురైన రమశ్ బుధవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య బాలమణి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఉరివేసుకుని యువకుడి..

వేములవాడఅర్బన్/ కోనరావుపేట(వేములవాడ): వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని చెట్టుకు ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వేములవాటటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన గాజుల రాజశేఖర్(28) రెండేళ్లుగా కరీంనగర్‌లో ఆటో నడుపుతూ అక్కడే ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం ఆటోపై వచ్చి నాంపల్లి శివారులో చెట్టుకు ఉరివేసుకున్నాడు. బుధవారం ఉదయం అటువైపు వెళ్లిన స్థానికులు చూసి వేములవాట టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాజశేఖర్ మద్యానికి బానిసై మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అమరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ అమరుల ఆశయ సాధన సమితి జేఏసీ జిల్లా కన్వీనర్ గరిపెల్లి ప్రభాకర్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో బీఆర్‌ఎస్ నేతలే కాకుండా పలు పార్టీలకు చెందిన వారు పోరాడారన్నారు. ఎందరో ప్రాణత్యాగాల ఫలితంగా తెలంగాణ సాధ్యమైందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పేరిట ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. టీపీఏసీ జేఏసీ సభ్యులు మేకల కమలాకర్, సిరస్వాల్ కైలాశ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్ట్

- 150 గ్రాముల గంజాయి స్వాధీనం

సిరిసిల్లక్రైం: గంజాయి సేవిస్తున్న ఇద్దరిని బుధవారం అరెస్ట్ చేసినట్లు సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్‌పార్క్‌కు చెందిన పులి అరుణ్, అదే మండలం మండెపల్లికి చెందిన గంగాధర సాగర్ కొన్ని రోజులుగా జల్సాలకు అలవాటు పడి గంజాయి తాగుతున్నారు. అంతేకాకుండా మరికొందరికి సరఫరా చేస్తున్నారు. బుధవారం సిరిసిల్ల బైపాస్‌రోడ్డులోని ఎల్లమ్మగుడి సమీపంలోని కల్లు దుకాణం వద్ద గంజాయి సేవిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.

ధర్మారంలో నాటుబాంబులు లభ్యం

- సీసీఎస్ పోలీసుల దాడులు
- 80 నాటుబాంబులు స్వాధీనం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారంలో నాటుబాంబుల తయారీ కేంద్రంపై బుధవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. కోనరావుపేట మండలం ధర్మారంలో నాటుబాంబులు తయారు చేస్తున్నారన్న సమాచారంతో సీసీఎస్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం ఇంట్లో 80 నాటుబాంబులు స్వాధీనం చేసుకుని, రాజలింగంను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా రాజలింగం గతంలోనూ కొన్ని నేరాలలో నిందితుడు. పోలీసుల దాడిలో నాటుబాంబులు దొరికాయన్న వార్తతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ఈ దాడిలో ఏఎస్సై రఘుపతిరెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.



రాజన్న దర్శనం రమణీయం

వేములవాడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలోనూ బుధవారం రాజన్నను భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కృష్ణాష్టమి సందర్భంగా స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతపద్మనాభస్వామి, సీతారామచంద్రస్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు స్వామిగౌడ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గడప గడపకూ బహుజన సమాజ్ పార్టీని తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పూర్తి స్థాయి కమిటీలు వేస్తామన్నారు. బీసీ కులాలకు రాజ్యాధికార అవగాహన కల్పించాలని కోరారు. ప్రతీ గ్రామంలో పార్టీ జెండాల గద్దెలను నిర్మించి ఆవిష్కరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. జిల్లా ప్రచార కార్యదర్శి యారపు రాజబాబు, జిల్లా ఈసీ మెంబర్ తాటిపల్లి అంజయ్య, మండల ఇన్‌చార్జి లింగాల సందీప్, నాయకులు సంజీవ్, నీలేశ్, లక్ష్మీరాజం, రాజు, కిషన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వామిగౌడ్

పదోన్నతులు కల్పించండి

- టీటీయూ జిల్లా అధ్యక్షుడు రవి

ముస్తాబాద్(సిరిసిల్ల): భాష, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు కల్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండికొప్పుల రవి, ప్రధాన కార్యదర్శి తడకల సురేశ్ కోరారు. ముస్తాబాద్‌లో బుధవారం నిర్వహించిన టీటీయూ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వ్యాయామ, భాషోపాధ్యాయులకు సంబంధించిన అప్‌గ్రెడేషన్ అంశం కోర్టు పరిధిలో ఉండడంతో నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుంటే న్యాయం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యాదగిరి, అమీరొద్దీన్, ఉమా, స్రవంతి పాల్గొన్నారు.

వేములవాడ బీజేపీ అభ్యర్థుల దరఖాస్తు

వేములవాడ: వేములవాడ అసెంబ్లీ స్థానం నుంచి ఎర్రం మహేష్, మానకొండూర్ నుంచి కుమ్మరి శంకర్‌లకు అవకాశం కల్పించాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో పార్టీ నాయకులకు దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు ముప్పిడి సునంద, గడ్డమీది లావణ్య, బీజేవైఎం నాయకులు సార్ల చారి, ఈర్లపల్లి హరీశ్ ఉన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగారెడ్డి దరఖాస్తు

కోనరావుపేట: వేములవాడ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసినట్లు మోతె గంగారెడ్డి తెలిపారు. కోనరావుపేట మండలం శివంగాలపల్లికి చెందిన గంగారెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తన దరఖాస్తును అందజేశారు. కోనరావుపేట సింగిల్‌విండో చైర్మన్‌గా పనిచేసిన తనకు వేములవాడ టికెట్ అందివ్వాలని కోరారు.



జర్రున జారుడే..



చిన్నపాటి వర్షానికే బోయినపల్లి మండలం కొదురుపాక -వెంకట్రావుపల్లి మధ్య ప్రధాన రహదారి బురదమయం అవుతుంది. దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం పనులు జరుగుతున్నాయి. చిరుజల్లులకే ఎర్రమట్టి బురదగా మారి వాహనాలు జారి ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం క్రషర్‌డస్ట్ పోయాలని వాహనదారులు కోరుతున్నారు. - వేములవాడఅర్బన్